క్లుప్తంగా

వృద్ధులకు చీరల పంపిణీ

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం వృద్ధులు, దివ్యాంగులకు చీరలు పంపిణీ చేశారు. నిత్య అన్నదాన దాత జి.జయకుమార్, జయప్రద దంపతులు వీటిని పంపిణీ చేశారు. జయకుమార్ తల్లి సూర్యకాంతం జ్ఞాపకార్థం చీరలను పంపిణీ చేసి, అనంతరం అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ సేవలు ఆదర్శనీయమని జయకుమార్, జయప్రద దంపతులు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక విద్యుత్ మరమ్మతుల సందర్భంగా శనివారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం తెలిపారు. దీని ప్రభావంతో వీఎల్‌పురం, వీఎల్ పురం పార్క్ స్ట్రీట్స్, చైతన్య కాలేజ్ స్ట్రీట్, వీఎల్ పురం పెద్ద వీధి, ఆదర్శ్ హాస్పిటల్ రోడ్, వాసిరెడ్డి రాంబాబు స్ట్రీట్, చక్రధర్ హాస్పిటల్ ఏరియా, తిలక్ రోడ్, ఏవీఅప్పారావు రోడ్, మార్గాని ఎస్టేట్ రోడ్, మోరంపూడి, తిలక్ రోడ్, సత్యనారాయణపురం, రైతుబజార్ రోడ్, కోనేరుపేట, ఆల్‌బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న రౌతు సూర్యప్రకాశరావు, పూర్వ విద్యార్థులు

కంబాలచెరువు: పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తున్న మొక్కలను అందరూ బాధ్యతగా నాటాల్సిన అవసరం ఉందని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. మున్సిపల్ టౌన్ హైస్కూల్ పూర్వ (1987) విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరి గట్టున గౌరీ సమేత విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో రౌతు సూర్యప్రకాశరావు, పూర్వ ఉపాధ్యాయిని ధర్మవతి ఆధ్వర్యంలో ఎంటీసీ పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్థానికులు, పాదచారులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

సెబ్ విస్తృత దాడులు



సారా, నిందితునితో ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు శుక్రవారం సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, రాజానగరం మండలం ఫరిజల్లిపేటకు చెందిన కొత్తపల్లి అప్పన్నను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎస్సైలు వై.దుర్గాప్రసాద్, బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

కడియం: జిల్లా ఎస్పీ పి.జగదీష్, సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఆదేశాల మేరకు కడియం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సైలు బి.నాగదుర్గాప్రసాద్, టి.కృష్ణసాయి, సిబ్బంది మండలంలోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటింగ్ శాతం పెరగాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకు పోలీస్ సిబ్బంది అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సినిమాలు

శ్యామల : ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ : కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యప్యాలస్ : ప్రతినిధి–2
స్వామి : కృష్ణమ్మ
శివజ్యోతి : గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ : లక్ష్మీకటాక్షం
రాజా : రత్నం
ఊర్వశి : బాక్
రంభ : కింగ్ డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
మేనక : ప్రసన్నవదనం
అప్సర : కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి : రత్నం

నామవరం
వీఎస్ మహల్: కృష్ణమ్మ, ప్రతినిధి–2

ధవళేశ్వరం
మురళీకృష్ణ : కృష్ణమ్మ, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్

కడియం
వెంకటసూర్య : ఆ ఒక్కటీ అడక్కు

నేను ఎమ్మెల్యే అయితే..

యువతకు పదివేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



రాజమహేంద్రవరం సిటీ: ప్రధానంగా రాజమహేంద్రవరం నగరంలో రౌడీ షీటర్లు, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ వంటి సంఘ విద్రోహ శక్తులను నగర బహిష్కరణ చేయిస్తా. నగరవాసులకు 24 గంటలూ నిరంతర మంచినీటి సరఫరా, నగరంలోని యువతకు పది వేల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ధ్యేయంగా పనిచేస్తా. రివర్ సిటీ అందాలు చూసేలా ఘాట్లను ఏకం చేయడం, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతా. మూడు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకువస్తా. ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు, జగనన్న కాలనీల్లో 40 వేల మందికి ఇళ్లు కట్టించి, లబ్ధిదారులకు అప్పగించే బాధ్యత చేపడతాను. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మాదిరిగా లాలా చెరువు, పిడింగొయ్యి, బొమ్మూరు, వేమగిరి జంక్షన్లలో కూడా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపడతాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, గుడ్ మార్నింగ్, రాజన్న రచ్చబండ కార్యక్రమాలు, వారం వారం అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తా.

– ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, రాజమహేంద్రవరం సిటీ

ప్రజా సేవకుడినవుతా..



రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్‌గా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో బాధ్యతలు చేపట్టిన మూడు నెలల కాలంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాను. గోతులమయంగా ఉన్న ప్రధాన రోడ్లన్నీ నిర్మించాను. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో అపరిశుభ్రత, పారిశుధ్య వ్యవస్థ, మురుగునీటి పారుదల మెరుగుపరుస్తా. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో తాగునీటి అవసరాలు తీరుస్తా. గ్రామాలు, డివిజన్ల వారీగా నేను విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను.. అనుభవాన్ని జోడించి అమలుచేస్తా. రూరల్ నియోజకవర్గ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా అన్ని చర్యలు చేపడతా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతరం పర్యవేక్షిస్తా. ఒక ఎమ్మెల్యేగా కాకుండా.. ఓ సేవకుడిగా ప్రజలకు సేవలందిస్తా.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజమండ్రి రూరల్ నియోజకవర్గం

తుఫ్యాన్ వేగంతో..

- వైఎస్సార్ సీపీ ప్రచార జోరు
- కంగుతింటున్న కూటమి శ్రేణులు
- అభివృద్ధి, సంక్షేమమే గీటురాయి అంటున్న విశ్లేషకులు



జోరుగా ప్రచారం సాగిస్తున్న ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక రాజమహేంద్రవరంలో ఫ్యాన్ గాలి బలంగా వీస్తోంది. కూటమిగా ఎన్నికల బరిలోకి దిగిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఒంటరిగా పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ ధాటికి విలవిల్లాడుతున్నాయి. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్‌రామ్ హుషారుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్‌రామ్ సారథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులే ఆయన విజయానికి కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ టీడీపీ కంచుకోటకు బీటలు తప్పవన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ, ముందెన్నడూ లేనంతగా నగరాన్ని అభివృద్ధి చేసి, రూపురేఖలు మార్చేసిన భరత్‌రామ్ కార్యదక్షత ప్రజానీకాన్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఆయనకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పలువురు టీడీపీకి చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిలో మాజీ కార్పొరేటర్లు గాదిరెడ్డి పెదబాబు, అరిగెల బాబు, పితాని లక్ష్మీకాంతం, బూరాడ కృష్ణమాధురి తదితరులు ఉన్నారు.

రాజమహేంద్రవరంలో 2019 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.400 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులతో నగరం సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. అభివృద్ధితో పాటు, సంక్షేమం రెండు కళ్లుగా సాగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని వివిధ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఆది నుంచీ విమర్శల వెల్లువ

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆదిరెడ్డి వాసుపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో భయాందోళనలు సృష్టిస్తున్న బ్లేడ్ బ్యాచ్‌కు ఊతమివ్వడంలో ఈయన హస్తం ఉందనే ఆరోపణలు లేకపోలేదు. దీనికి తోడు కొన్ని సందర్భాల్లో ఇతని వ్యవహార శైలి కొందరు పార్టీ శ్రేణులకు రుచించడం లేదు. కొందరైతే పార్టీని వీడేందుకూ వెనుకాడడం లేదు. ఇటీవల టీడీపీ మాజీ కార్పొరేటర్ పితాని లక్ష్మీకుమారి ఇతని తీరుపై తీవ్ర మనస్థాపానికి గురై, టీడీపీకి రాజీనామా చేయడమే ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. అంతేగాక ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో ఆమె వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో కొందరు సీనియర్లనూ పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని డివిజన్లలో తమకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయంగా మరొకరిని సిద్ధం చేయడం వంటి చర్యలతో అతనిపై కొందరు పార్టీ సీనియర్లు గుర్రుగా ఉన్నట్టు వినికిడి. ఇవన్నీ పక్కనపెడితే.. ఒకటిన్నర దశాబ్దాలకు పైగా అనేక చట్టబద్ధ పదవుల్లో ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ.. నగరాభివృద్ధిపై వారి ముద్ర కొంచెం కూడా లేదన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు అనుభవించినప్పటికీ, నగరానికి చేసిన అభివృద్ధి శూన్యమనే అపవాదును మోయాల్సి వస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆదిరెడ్డి భవాని ఐదేళ్లుగా ప్రజా సమస్యలను పట్టించుకున్న సందర్భాలే లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయావకాశాలపై ప్రభావం చూపగలవని విశ్లేషకులు చెబుతున్నారు.

నిత్యం ప్రజల మధ్య ఉంటూ, అలుపెరుగకుండా కష్టపడుతున్న భరత్‌రామ్‌వైపే నగర ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్టు చర్చలు సాగుతున్నాయి. రాజన్న రచ్చబండ ద్వారా ప్రజల సమస్యలపై అతను స్పందిస్తున్న తీరు వారిని ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే భరత్‌రామ్‌కు ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణ ప్రత్యర్థి పార్టీల్లో గుబులు పుట్టిస్తోంది.

అభివృద్ధికే పట్టం!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కంబాలచెరువు పార్క్ అభివృద్ధి, ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్, గ్లో గార్డెన్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, గ్రాండ్ ట్రంక్ రోడ్, వివిధ పార్కులు, వై.జంక్షన్ అభివృద్ధి, డివైడర్ల సుందరీకరణ, పలు సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల ఆధునీకరణ, పుష్కర్‌ఘాట్ అభివృద్ధి, పుష్కర ప్లాజా, పచ్చదనం, దండి సత్యాగ్రహ విగ్రహాల ఏర్పాటు ఇలా అనేక అభివృద్ధి పనులు పుష్కలంగా జరిగాయి. రాజమహేంద్రవరం నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.125 కోట్ల ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేయడంతో నగరపాలక సంస్థ శరవేగంగా అభివృద్ధి చేపట్టింది. నగర పురోగతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవకు ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. ఈ క్రమంలోనే ఎన్నికల్లో అభివృద్ధికే ప్రజలు పట్టం కడతారన్న వాదనలు జోరుగా వినిపిస్తున్నాయి.

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి

రూరల్ ఆర్ఓ తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను ఈ నెల 12లోగా సజావుగా నిర్వహించాలని రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో ఆయన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సెక్టారు ఆఫీసర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఆర్ఓ తేజ్‌భరత్ మాట్లాడుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు రాజమండ్రి రూరల్, కడియం మండలాలు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారికి రాజమండ్రి రూరల్ (అర్బన్ పార్ట్)ల బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. వీల్ చైర్ అటెండెంట్స్‌ను ట్యాగ్ చేయడం, మంచి నీటి సదుపాయాలు తదితర పనులను కేటాయిస్తూ సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో)లు ఏఎస్‌డీ లిస్టు ప్రిపరేషన్, పోస్టల్ బ్యాలెట్ స్టాంపింగ్ పూర్తి చేశారన్నారు. ఓటర్లందరూ ఎన్నికల్లో పాల్గొనేలా అన్ని రకాల స్వీప్ కార్యక్రమాలు రూపొందించినట్టు వివరించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే..



ఎన్నికల ప్రచారం చేస్తున్న మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

చంద్రబాబుపై ఎంపీ మార్గాని ఫైర్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని, సీఎం కుర్చీ కోసం ఎన్ని అబద్ధాలైనా ఆడటానికి దిగజారే మోసకారి అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ దుయ్యబట్టారు. శుక్రవారం 45వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ 2014 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు 640 హామీలతో ప్రజలను నమ్మించి, ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి, ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, 2018లో ఎన్డీఏకు గుడ్ బై చెప్పి, ధర్మ పోరాటం పేరుతో ఢిల్లీలో నిరసనలు, ప్రధాని మోదీని నోటికొచ్చినట్టు దూషించి, అమిత్ షాను అవమానించారని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు సిగ్గు లేకుండా ఎన్డీఏతో జత కట్టారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నట్టు చెప్పే చంద్రబాబు, ప్రత్యేక హోదా కోసం ప్రధాని నుంచి ఏమైనా హామీ తీసుకున్నారా తెలపాలని డిమాండ్ చేశారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలెవ్వరూ విశ్వసించడం లేదని, 2014 ఎన్నికల్లో చేసిన మోసం చాలని ప్రజలు ముక్తకంఠంతో అంటున్నారన్నారు. ఉద్యోగాలని, నిరుద్యోగ భృతి అని, డ్వాక్రా, రైతు రుణ మాఫీలని ఇలా ఎన్నో హామీలిచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. తెలంగాణలో మకాం, ఏపీలో రాజకీయ వ్యాపారాలు చేసే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు ప్రజలే సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జగనన్న 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేసి, జనరంజక పాలనతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. తాను ఎంపీగా చేసిన అభివృద్ధి కార్డు చూసి, ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే, మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యాన్ విజయం.. ప్రజలకు అభయం

- మోసాలతో యుద్ధం చేస్తున్నాం
- కాతేరు ఎన్నికల ప్రచారంలో మంత్రి వేణు



కాతేరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు చెల్లుబోయిన వేణు, డా.గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: మీ ఓటు చాలా విలువైనది, ఫ్యాన్ గుర్తుకే వేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చి.. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలంటూ మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. కాతేరు గ్రామంలో శుక్రవారం ఆయన, ఎంపీ అభ్యర్థి డా.గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తమను గెలిపించాలని కోరారు. అనంతరం వేణు మాట్లాడుతూ మోసాలతో యుద్ధం చేస్తున్నాం, వలంటీర్లు ఇంటికే రావాలన్నా, పేదవారి బతుకు మరాలన్నా, వైద్యం, వ్యవసాయం మెరుగుపడాలన్నా.. ఫ్యాన్ గుర్తుకు రెండు బటన్లు నొక్కాలని కోరారు. హామీలను 99 శాతం అమలు చేశామని, 59 నెలల కాలంలో రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశామని వివరించారు. ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ బోధన, ట్యాబ్‌లు, బైలింగువల్ టెక్స్ట్ పుస్తకాలు.. ఇలా గతంలో ఎన్నడూ లేనట్టుగా చేశామన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్య దీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అక్క చెల్లెమ్మలకు ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 21 లక్షల ఇళ్లు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. రైతులకు పగటి పూట 9 గంటల నాణ్యమైన విద్యుత్తు ఇచ్చామని, వాహన మిత్ర, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, లా నేస్తం, జగనన్న తోడు.. గతంలో ఎప్పుడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, విలేజ్ క్లినిక్, ఫామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష అమలు చేశామన్నారు. 600 సేవలందించే సచివాలయం, ఇంటి ముంగిటకే పౌర సేవలు, రూ.3 వేల పెన్షన్ గతంలో ఎన్నడూ లేవన్నారు. మూడు సార్లు సీఎం అని చెప్పే చంద్రబాబు చేసిన మేలు ఒక్కటైనా గుర్తుకు రాదన్నారు. రాబోయే ఐదేళ్లలో ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించేది ఈ ఎన్నికలేనని, ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, డా.గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి డా.గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో వస్తున్న టీడీపీ, బీజేపీని ఓటు అనే ఆయుధంతో ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలన్నారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆచంట సుబ్బారాయుడు, ఆచంట కల్యాణ్, యెజ్జు వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, కొల్లి నాని, పెనుమాక సునీల్, మద్దా దుర్గారావు, రొంగల వెంకటేష్, సోము సతీష్, రంజిత్, తానేటి నాని, ఉండ్రాజవరపు సూర్య, నక్కా పుల్లయ్య, బూర దిలీప్, కొల్లి వెంగళరావు, కంకిపాటి రాజు, కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ప్రచారం చేస్తున్న పార్టీ అభ్యర్థులు

సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాత అని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ధవళేశ్వరంలో ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. విద్యారంగంతో విప్లవాత్మక మార్పులను తెచ్చారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పు తెచ్చి, ప్రజలకు ఇంటి వద్దే సేవలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు పేదల విజయమే..

పార్టీ పరిశీలకుడు రావిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న రావిపాటి రామచంద్రరావు

కడియం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుపు పేదల విజయం అవుతుందని పార్టీ రాజమహేంద్రవరం నియోజకవర్గ పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన వేమగిరిలోని ఆయన ఇంటి వద్ద స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రావిపాటి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డా.గూడూరి శ్రీనివాస్‌కు అఖండ విజయం చేకూర్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే రూరల్‌లో మంత్రి వేణుపై ఉన్న నమ్మకం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయాన్ని సాధించి పెడుతున్నాయన్నారు. రూరల్‌లో ప్రజలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యవహారంతో విసిగిపోయి ఉన్నారన్నారు. ప్రచార సమయంలో ప్రజల అసహనం బైటపడడాన్ని ఆయన గుర్తు చేశారు. వచ్చిన మూడు నెలల్లోనే మంత్రి వేణు అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారన్నారు. అంతే కాకుండా పార్టీ శ్రేణుల్లో కూడా నమ్మకాన్ని పెంపొందించుకోగలిగారన్నారు. ఈసారి రూరల్‌లో తప్పకుండా విజయం సాధిస్తారని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ వంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, నాయకులు నక్కా రాజబాబు, ఈలి గోపాలం, పితాని శ్రీను, గరగా సుమన్‌బాబు, నరాల శ్రీను, భాస్కరరావు, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కమిషనర్, సిటీ ఎన్నికల ఆర్ఓ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న ఆర్ఓ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్, సిటీ ఎన్నికల ఆర్ఓ దినేష్‌కుమార్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సెక్టార్, వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వారి వివరాలను ఎలక్ట్రోరల్ రోల్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే రోజున బీఎల్ఓ, సువిధ తదితర యాప్‌లను సిబ్బంది ఉదయం 9 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి పోలింగ్ స్టేషన్ల వారీగా విభజించి, పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. సెక్టార్ అధికారుల వద్ద ఎన్నికల సామగ్రి ఒక సెట్ ఉంచుకుని, అవసరమైన చోట వారికి అందజేయాలన్నారు. 12న ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం 13న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తిరిగి స్వీకరించటానికి కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతిగా ఆచార్య కె.పద్మరాజు ఆ పదవిని చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ క్యాంపస్‌లోని బోధన, బోధనేతర సిబ్బందితో పాటు, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల ఉద్యోగులు మొదటి వార్షికోత్సవాన్ని యూనివర్సిటీ సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన ప్రగతిపై వార్షిక నివేదికను సమర్పించారు. వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ ఈ స్థాయి రావడానికి కారకులైన పూర్వ వీసీల సేవలను మననం చేసుకున్నారు. వారి స్ఫూర్తితో తాను వీసీ పదవిని హోదాగా కాకుండా, ఓ బాధ్యతగా భావించి, యూనివర్సిటీ ప్రగతికి కృషి చేస్తున్నానని, ఏడాది కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల ప్రిన్సిపాళ్లు టి.అశోక్, ఎం.కమలాకుమారి తదితరులు పాల్గొన్నారు.